# ఆహ్వానం

ఉద్యోగ చక్రబంధంలో చిక్కుకున్న నేను చాలా కాలానికి మా సొంతూరుకు వెళ్ళాను. అందునా పండగల సెలవులాయె. నేనూరుకున్నా మా పిల్లలు ఊరుకోరు. బహుశా వాళ్ళు నాలాగే ఇంకా ఎక్కువగానే ఈ 'చదువు' ఊబిలో చిక్కుకొని విలవిలలాడుతున్న సందర్భంలో ఇలాంటి సెలవులు వాళ్ళకు కాస్తంత ఊరట, ఉత్సాహాన్ని ఇస్తాయనుకుంటాను.

ఆధునిక జీవితం, సంబంధాలు 'ఆర్థికం' చుట్టే పరిభ్రమిస్తున్న తరుణంలో కనీసం ఈ మాత్రం మానవతా పరిమళాలు విరజిమ్మాలంటే ఎడారిలో ఒయాసిస్సులా ఇలాంటి సెలవులు అవసరమే మరి.

'మనిషన్నాక ఆ మాత్రం కళాపోషణ' అనునుగాని ఆ మాత్రం కాలక్షేపం అవసరమే మరి.

పట్టణ ప్రాంత వాతావరణానికి అలవాటుపడ్డ పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడు ఊరుకెళ్దామని ఎంత మారాం చేస్తారోకాని తీరా వెళ్ళాక - ఆ వాతావరణంలో ఇమడలేక మళ్ళీ పెట్టేబేడా సర్దుకుందామంటారు.

ఉక్కపోతను భరించలేరు. ఉబుసుపోను భరించలేరు. బహుశా మధ్యతరగతి త్రిశంకు స్వర్గం కూడా ఇదేనను కుంటాను. అంతేకాదు నా ఊరునే పరిశీలిస్తే పల్లె పల్లెగా ఉండలేకపోతుంది. అదే సందర్భంలో పట్టణంగాను మారలేకపోతుంది.

వివిధ రంగాలలోని 'ఉద్యోగాలను' యాంత్రికంగా చేసుకొని పోవచ్చేమో కాని విద్యారంగంలోని ఉపాధ్యాయవృత్తిని మాత్రం అలా చేసుకొని పోలేము. బహుశా అది మేధా సంబంధమైనదే కాదు హృదయ సంబంధి కావడం కూడా విశేషం అనుకుంటాను.

ఏమైనా 'చదువులమ్మ చెట్టు'కి రోజు వింత వింత పుష్పాలు పూస్తుంటాయి. దేని పరిమళం దానిదే. దేని అనుభూతి దానిదే. అలాగే ఉద్యోగాన్ని రొటీన్‌గా మార్చుకుంటే అది యాంత్రికమైపోతుందే తప్ప సృజనాత్మకతను అందించదు.

ఉద్యోగం, కుటుంబం యొక్క వత్తిళ్ళ పొత్తిళ్ళలో కూడా ఆ అనుభూతిని, ఆనందాన్ని మిగుల్చుకోవడానికై ప్రయత్నిస్తున్నాను. మార్కెట్ వ్యవస్థలో మారని మనిషని మా వాళ్ళు అంటున్నా... నా ఉపాధ్యాయ జీవితంలోని అనుభూతి అనురాగ, ఆత్మీయతా అనుబంధాలే చివరకు నాకు మిగిలే ఆస్తిపాస్తులనుకుంటాను.


ఆరుబయట పడుకొని మా పాతరేడియోని పెట్టుకొని ఆనాటి పాత పాటలు వింటుంటే అదొక మధురానుభూతి. అదెంత 'శబ్దం' చేసినా అప్పుడప్పుడ కూని రాగాలు తీసినా దాని ప్రత్యేకత దానిదే. ఉగాది పచ్చడి తిని, పద్యం విన్నంత హాయిగా ఉంటుంది.

ఈ లోపే మా అమ్మ ''బాబూ! నీకో కవర్ వచ్చింది... ఇదిగో'' అంటూ ఇచ్చింది. ఆ కవర్ ఆనవాళ్ళు చూస్తే చాలా రోజుల క్రిందే వచ్చినట్లనిపించింది.

అప్పుడప్పుడు నా మనసుకు నచ్చిన అంశాలపై కవితలో, వ్యాసాలో, కథలో రాయడం... అవి పత్రికలకు పంపడం జరుగుతుండేది. అలా ప్రచురించిన వాటిల్లో నా కవితా సంపుటి ఒక్కటి. ఒకరో ఇద్దరో అపరిచితులు, సహృదయులుఎక్కడో ఓ చోట చూసినప్పుడు... దానిపై వారి అభిప్రాయాన్నో, అభినందనో, ఆశీస్సునో... అందించడం పరిపాటి. కవర్ విప్పక ముందు ఇదీ అలాంటిదేననుకున్నాను.

కాని ఆ ఉత్తరంలోని ఒక్కొక్క అక్షరం నన్ను జ్ఞాపకాల పొరల్లోకి చొచ్చుకొని వెళ్ళేటట్లు చేసింది. కారణం అది అనూహ్యం, అపూర్వం కావడమేననిపించింది.

డా|| శంకరమంచి శ్యామ్‌ప్రసాద్



*ముంబయిలో జరిగిన సభలో 'నేడు' పక్షపత్రికను ఆవిష్కరిస్తున్న కవి డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి. చిత్రంలో బైస దేవదాస్, షబ్బం మౌసీ, సంపాదకులు మంజులా రెడ్డి తదితరులు.*

చదువుతున్నప్పుడే పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల పేరు తెలియని విద్యార్థులు అలాగే తను వెళ్ళే తరగతిలోనున్న విద్యార్థుల పేరు తెలియని ఉపాధ్యాయులున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎప్పుడో పాతికేళ్ళ క్రితం తనకు పదో తరగతిలో పాఠం చెప్పిన ఉపాధ్యాయుణ్ణి గుర్తుంచుకొని... ఆనాటి మధురస్మృతుల్ని ఒక్కొక్కటిగా గుర్తుకు తెచ్చుకుంటుంటే హృదయం అనుభూతి సాంద్రతతో నిండిపోయింది.

రమ్య ఎప్పుడో పాతికేళ్ళ క్రిందట నా విద్యార్థి. పేరుకు తగ్గట్లుగానే ఆమె రూపంలోను, ఇటు చదువులోను చురుకుగా ఉండేది. ఇంట్లో తన మాతృభాష వేరే అయినా వాళ్ళ కుటుంబం ఇక్కడే స్థిరపడింది కాబట్టి

## పాడవే కోయిలా!

ఆకుపచ్చని పాట అందాల నీనోట
పాడవే కోయిలా! పంచమం సవరించి
వినువీధి మేఘాలు వియ్యమందుకొనంగ
తరులతా కుంజాలు తడియుచు మురియంగ
పండుటాకులు రాలి పసిడిరేకులు డోల
చీకుచింతలు రాలి సింగారముల హేల
పంటచేనులు లేక పరిగెతైనను లేవు
కడుపు నిండక కంటి కునుకైన కనరాదు
లేకి బతుకులు ముందె లేమి కెరయగుచుండె
కలిమి కన్నుల ముందె కబళించబడుచుండె
చెంత వాగులు యున్నా దప్పి తీరుట లేదు
మేఘ గర్జనలున్నా చిన్న చినుకే రాదు
నాది నాదను వారే మీది కగుచున్నారు
పేదవారల బతుకు వీధిపాలగుచుండె
ఒకనాడు బంగారు నెమలిగా భాసిల్లె
ఈనాడు ఈభూమి మరుభూమి తలపించె

కాసోజు లక్ష్మీనారాయణ

ఇక్కడి ఆచార వ్యవహారాలు... సంస్కృతీ సంప్రదాయాలు బాగా ఒంటబట్టించుకుంది. తెలుగును గలగల మాట్లాడేస్తుంది. చకచక రాసేస్తుంది.

ఇంటర్మీడియెట్ పూర్తి కాగానే ఏదో పోటీ పరీక్షరాసి

## శ్రమగీతి

జయతు జయతు
జయతు జయతు కార్మికా
జయతు జయతు
జయతు జయతు శ్రామికా ॥జయతు॥

విడివిడిగా ఐదువేళ్లు
ముడివడగా పిడికిళ్లు
వెలుగురవ్వ దివ్వెలుగా
ఎత్తిన నీ పిడికిలిలో
ఉంది శక్తి సమస్తం
విశ్వంలో నీదు శక్తి
విస్తరిల్లె నీ తేజం ॥జయతు॥

ప్రాంతం ఏదైతేనేం
దేశం ఏదైతేనేం
విశ్వవ్యాప్తివై నీవు
వెలుగొందే జ్వాలవు
నింగి నేల నీటిలోన
ప్రవహించే మహాశక్తి
జన జీవన చైతన్యం
ప్రసరించే దివ్య దీప్తి. ॥జయతు॥

బద్ది నాగేశ్వరరావు

ఉద్యోగంలో స్థిరపడింది. తన ప్రతిభను ఆమె పూర్తిగా వికసింపనీయకముందే ఉద్యోగ బాధ్యతల్లో చిక్కుకుపోయింది. బహుశా మధ్యతరగతి ఆడపిల్లల కుటుంబాల పరిస్థితి అలా వాళ్ళ తెలివితేటల్ని చిదిమివేస్తుందేమో! ఉద్యోగినిగా, గృహిణిగా తన బాధ్యతల్ని, నిర్వహిస్తూనే తనూ రచనా వ్యాసంగానికి అప్పుడప్పుడు 'పాల్పడుతోందట'.

తను రాసిన ఒకటి రెండు కథలకు పోటీలో బహుమతులను సైతం గెలుచుకుందట. దానికి కారణం తనకు పాఠశాలలో తెలుగు నేర్పిన నేనే ఒక కారణమంటూ అభిమాన జల్లును కురిపిస్తూ... అక్షరాలలో అభినందనలను చిలికించింది. ఇదంతా ఆమె 'భ్రమే'నని నా అభిప్రాయం.

కవులను, రచయితలను ఎవరూ సృష్టించరు. స్పందించే హృదయమే వాళ్ళచే అక్షరతోరణాలు కట్టిస్తుంది. తనకిద్దరు పిల్లలని, భర్త కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అని, తన ఉద్యోగ కుటుంబ బరువు బాధ్యతలన్నీ ఆత్మీయులతో పంచుకున్నట్లుగా పంచుకుంది.

ఇటీవల తన కొడుకు పుస్తకాల కోసం అని కోఠికి వెళ్తే అక్కడి ఓ బుక్‌షాపులోకి వెళ్లి పరిశీలిస్తుంటే... అక్కడ పేర్చిన పుస్తక అట్టపై ఉన్న నా 'ఫోటో' తన దృష్టిని తీవ్రంగా ఆకర్షించిందట.

అవునా కాదా అని ఒకటికి రెండుసార్లు ఆ ఫోటోను చూసి చివరకు అట్టవెనకాల ఉన్న పరిచయ వివరాలు చూసుకొని నిర్ధారణకు రాగానే... అసలు తను వచ్చిన పనే మరిచిపోయిందట. వెంటనే ఆ 'బుక్'లోనున్న నంబరుకు ఫోను చేసిందట.

అది ఎంగేజ్ రావడంతో ఒకసారి, కవరేజ్ ఏరియాలో లేరని ఒకసారి, స్విచాఫ్ అని ఒకసారి రావడంతో లాభం లేదనుకొని ఇంటికి రాగానే ఆ జ్ఞాపకాలన్నీ ఎక్కడ మరచిపోతానేమోనని గబగబ ఈ ఉత్తరం రాసిందట.

అక్షరాలు అటుఇటైనా, పదాలు అటుఇటు దొర్లినా... విద్యార్థి... ఉపాధ్యాయుని మధ్య ఉన్న ఆ అవినాభావ సంబంధం చెక్కు చెదరనందుకు... చెప్పలేని ఆనందాన్ని అనుభవించాను. ఉపాధ్యాయుణ్ణి అయినందుకు గర్వించాను.

వెంటనే నా పూర్వ విద్యార్థిని ఆమె కుటుంబాన్ని మా ఇంటికి ఆహ్వానిస్తూ ఫోను చేశాను. ఆమె ఆనందానికి హద్దులేదు అందుకే గోదావరి గలగలా, కృష్ణమ్మల బిరబిరలో ఆమె మాటల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. వారి రాకకోసం మా ఇల్లంతా కళ్ళుచేసుకొని చూస్తున్నాం.■